సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 20 । జూన్ । 2025



ఎస్సారెస్పీ వెలవెల

ఉత్తర తెలంగాణ జిల్లాల కల్ప తరువు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తగినంత నీటి నిల్వ లేక వెలవెలబోతోంది.

- 10లో ▸



ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

మున్సిపల్ కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ పేర్కొన్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.9 /25.1

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రూ.214.56 కోట్ల రైతు భరోసా నిధులు జమ

- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకం కింద ఇప్పటి వరకు జిల్లాలోని 2,38,247 మంది రైతుల ఖాతాలలో రూ.214.56 కోట్ల నిధులు జమ అయ్యాయని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. వానాకాలం – 2025 సీజన్‌కు సంబంధించి జిల్లాలో మొత్తం 2,98,472 మంది రైతులకు పంట పెట్టుబడి సాయం కింద రూ. 326.03 కోట్ల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తోందని అన్నారు. ఈ నెల 5 వరకు కొత్త పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు వ్యవసాయ విస్తీర్ణాధికారులను కలిసి సరైన పత్రాలను సమర్పించాలని సూచించారు.

భూ భారతిలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర కీలకం

నిజామాబాద్అర్బన్: భూభారతి చట్టం అమలులో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యర్థులకు అందిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. అనుభవజ్ఞులైన వారితో అందిస్తున్న సర్వే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు చక్కగా సేవలందిస్తే, అనేక భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దీంతో భూ వివాదాలకు తావు లేకుండా చేయాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరుతుందని అన్నారు. శిక్షణ అనంతరం నిర్ణీత మార్కులతో పాసైన వారికి ప్రభుత్వం సర్టిఫికేట్ అందజేస్తుందని తెలిపారు. కలెక్టర్ వెంట సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, సిబ్బంది ఉన్నారు.

జక్రాన్‌పల్లి వీడీసీ రద్దు

- గ్రామస్తుల తీర్మానం



జక్రాన్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ)ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు జక్రాన్‌పల్లి వీడీసీ సభ్యులు గురువారం ప్రకటించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోలీస్ శాఖ నిర్వహించిన అవగాహన సదస్సులలో భాగంగా రాజ్యాంగంలోని చట్టాలకు అనుగుణంగా నడుచుకుంటామని నిర్ణయించుకొని గురువారం గ్రామసభ నిర్వహించి ప్రజలంతా కలిసి వీడీసీని రద్దు చేస్తూ తీర్మానం చేశామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్ : కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డిని గురువారం తన కార్యాలయంలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం, మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ ప్రాజెక్టులు, ఇతరత్రా అంశాలపై ఎంపీ చర్చించారు.

నేడు ఒలింపిక్ రన్



నిజామాబాద్‌నాగారం : జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించబోయే ఒలింపిక్ రన్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి తెలిపారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రన్ ప్రారంభోత్సవానికి కలెక్టర్, సీపీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. రాజరాజేంద్ర చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే ఒలింపిక్ రన్ గాంధీచౌక్, బస్టాండ్ మీదుగా కలెక్టర్ గ్రౌండ్‌కు చేరుకుంటుందన్నారు. రాజకీయ ప్రముఖులు, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు ఒలింపిక్ రన్‌లో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో చైర్మన్ లింగయ్య, కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, భూమారెడ్డి, గాదరి సంజీవరెడ్డి, స్వామి కుమార్, సురేశ్ పాల్గొన్నారు.

అతివ అసెంబ్లీకి పక్కా..!

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టనున్న నేపథ్యంలో మహిళా ఓటర్ల సంఖ్యపై జోరుగా చర్చ సాగుతోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల పరిధిలో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి అతివలు అసెంబ్లీకి వెళ్లడం పక్కా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా మహిళా ఓటర్లు
- ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడే అధికం
- ప్రతి సెగ్మెంట్‌లో వారి సంఖ్యే ఎక్కువ
- చట్టసభలోకి వెళ్లనున్న మహిళలు
- నియోజకవర్గాల పునర్విభజనతో మారనున్న ముఖచిత్రం

గత లోక్‌సభ ఎన్నికల్లో అసెంబ్లీ సెగ్మెంట్‌ల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆర్మూర్	98,116	1,12,612	06	2,10,734
బోధన్	1,05,609	1,15,701	04	2,21,314
నిజామాబాద్ అర్బన్	1,44,645	1,54,961	41	2,99,647
నిజామాబాద్ రూరల్	1,18,607	1,35,523	06	2,54,136
బాల్కొండ	1,03,995	1,21,263	02	2,25,260
జుక్కల్	99,524	1,03,498	09	2,03,031
ఎల్లారెడ్డి	1,06,881	1,16,423	02	2,23,306
కామారెడ్డి	1,22,474	1,32,682	19	2,55,175
బాన్సువాడ	93,762	1,03,250	13	1,97,025
జగిత్యాల	1,12,554	1,22,198	25	2,34,777
కోరుట్ల	1,15,932	1,28,153	04	2,44,089

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా నిజామాబాద్ జిల్లా నుంచి తదుపరి శాసనసభలోకి మహిళా ఎమ్మెల్యేలు ఎక్కువమంది అడుగు పెట్టే అవకాశం ఉంది. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉన్నప్పటికీ కొన్ని కారణాలతో ఆలస్యమైంది. అయితే 2027లో దేశవ్యాప్తంగా జనాభా లెక్కల అనంతరం రాష్ట్ర శాసనసభ స్థానాల పునర్విభజన చేపట్టడం ఖాయమైంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన ఉండనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు వరకు అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం ఉన్న 119 నియోజకవర్గాల సంఖ్య 153కు పెరగనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలున్నాయి. రాష్ట్రంలో ఒక్కో లోక్‌సభ స్థానం పరిధిలో ప్రస్తుతం 7 చొప్పున ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్లు 9కి పెరగనున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో మహిళల జనాభా, ఓట్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. రానున్న జనాభా లెక్కింపుతో పాటు ఓట్ల సంఖ్యలోనూ మహిళల ఓట్ల సంఖ్య మరింతగా పెరగనుంది.

ఇతర జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే మహిళల ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉంటూ వస్తోంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడంతోపాటు రాష్ట్రపతి ముద్ర వేశారు. దీంతో తెలంగాణలో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య 50గా ఉండనుంది. ఇతర ఉమ్మడి జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచే మహిళా ఎమ్మెల్యేలు ఎక్కువగా శాసనసభలోకి అడుగు పెట్టనున్నారు. ఇదిలా ఉండగా లోక్‌సభ సీట్ల పెంపు అంశంపై ఇప్పటివరకు ఒక స్పష్టత రాలేదు. లోక్‌సభ సీట్ల విషయమై దక్షిణాదికి అన్యాయం చేయొద్దనే వాదన నడుస్తున్న నేపథ్యంలో పెంచుతారా లేదా అనేది నిర్ణయం కాలేదు.

రాచమార్గంగా ఉమ్మడి జిల్లా సెగ్మెంట్లు!

ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ మహబూబ్‌నగర్ తదితర ఉమ్మడి జిల్లాల్లో ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆయా గిరిజన రిజర్వ్ సీట్లు ఎక్కువగా కేటాయింపు అవుతుంది. మరికొన్ని జిల్లాల్లో ఎస్సీ రిజర్వ్ సీట్లు కచ్చితంగా ఇవ్వాల్సిన పరిస్థితి. అయితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతోపాటు నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో ఉన్న మొత్తం 11 శాసనసభ సెగ్మెంట్‌లకుగాను జుక్కల్ అసెంబ్లీ సీటు మినహా 10 స్థానాలు జనరల్‌గానే ఉన్నాయి. అయితే ఈ 11 శాసనసభ సెగ్మెంట్లలో అన్ని స్థానాల్లోనూ మహిళా ఓటర్లే అత్యధికంగా ఉండడం ప్రత్యేకం. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి మహిళా ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం గణనీయంగా ఉండనుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోకి వచ్చే కోరుట్ల, జగిత్యాల సెగ్మెంట్‌లలో సైతం అత్యధికంగా మహిళా ఓటర్లే ఉండడం విశేషం. కాగా నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజకీయ వర్గాలతో పాటు ఇతర అన్ని వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ముఖ్యంగా నిజామాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్య భారీగా ఉన్న నేపథ్యంలో డీలిమిటేషన్‌లో నగరాన్ని ఏవిధంగా విభజిస్తారనే దానిపై ప్రతిఒక్కరిలో ఆసక్తి నెలకొంది. ఉత్తర దక్షిణంగా విభజిస్తారా, తూర్పు పడమరగా విభజిస్తారా అనే విషయమై చర్చ జరుగుతోంది. ఏఏ మండలాలు ఏఏ నియోజకవర్గాల్లోకి మారతాయోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

చెట్లతోనే మానవ మనుగడ



బాడ్సి సొసైటీ ఆవరణలో మొక్క నాటుతున్న డీసీవో, సీఈవో, నాబార్డ్ మేనేజర్ తదితరులు

- డీసీవో శ్రీనివాస్‌రావు
- బాడ్సి సొసైటీలో 'ఏక్ పేడ్ మా కే నామ్'

మోపాల్ : చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని జిల్లా సహకార అధికారి (డీసీవో) శ్రీనివాస్‌రావు తెలిపారు. బాడ్సి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రాంగణంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం (ఐవైసీ) – 2025 సందర్భంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ సహకార సంఘాల ప్రాంగణాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, వాతావరణంలో సమతుల్యత లోపిస్తే అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి విపత్తులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురవాలంటే తప్పకుండా మొక్కలు విరివిగా నాటాలని సూచించారు. భవిష్యత్‌లో మరిన్ని సహకార సంఘాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో నాబార్డ్ డెవలప్‌మెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఎన్‌డీసీసీబీ సీఈవో నాగభూషణం వందే, డీజీఎం లింబాద్రి, సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, సొసైటీ వైస్ చైర్మన్ రాజాకిషన్, మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి నర్సయ్య, మాజీ సర్పంచి మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- వివాదాలు లేనివాటిని వెంటనే పరిష్కరించాలి
- అర్హులకు న్యాయం జరిగేలా పనిచేయాలి
- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి



జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లిలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

జక్రాన్‌పల్లి : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ సందర్శించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సాంకేతిక అంశాలను జాగ్రత్తగా గమనించాలని, సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులలో పొందుపర్చాలని అన్నారు. వివాదాలు లేని తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యేలా తెలియజేయాలని అన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన మీదట క్షేత్రస్థాయిలో విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని, అప్పుడే భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ వివరించారు. వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ కిరణ్మయి, ఆర్ఐ ప్రవీణ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి

బాల్కొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. బాల్కొండ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. వర్షాలు కురిస్తే వాగుల్లో నీటి నిల్వలు చేరి ఇసుక లభించక ఇబ్బందిగా మారుతుందన్నారు. కావాల్సిన ఇసుకను నిల్వ చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకు కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఇసుక కొరతతో నిలిచిపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మరింత వేగవంతం చేయాలి

క్షేత్రస్థాయిలో భూమి పరిశీలన కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. మెండోరా తహసీల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకున్న మెండోరా మండలంలో భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆర్డీవో రాజుగౌడ్, తహసీల్దార్లు శ్రీధర్, సంతోష్‌రెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులపై టోల్ భారం

- నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు రూ.30 పెంపు
- ఒక్కో టోల్ గేట్‌కు రూ.10 చొప్పున అధిక చార్జీ



ఖలీల్‌వాడి : ఆర్టీసీ ప్రయాణికులపై టోల్‌భారం పడింది. నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఆరు డిపోల్లోని ప్రయాణికులకు రూ.20 నుంచి రూ.30 వరకు టికెట్ ధరలు పెరిగాయి. నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) టోల్ ట్యాక్స్ పెంచింది. దీంతో తెలంగాణ ఆర్టీసీ టోల్‌భారం పడకుండా ఉండేందుకు టికెట్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఒక్కో టోల్ గేటుకు రూ.10 చొప్పున భారం పడుతుంది. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఇందల్వాయి, భిక్కనూర్, తుప్రాన్ టోల్‌ప్లాజాలు వస్తాయి. ఈ ప్లాజాను బట్టి ఇక్కడి నుంచి ప్రయాణించే ప్రయాణికులకు టికెట్ ధర రూ.30 పెరిగింది. కామారెడ్డి, బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి రెండు టోల్ ప్లాజాలు ఉండగా, ఇక్కడి ప్రయాణికుల టికెట్ ధర రూ.20 పెరుగుతుంది. గతంలో ప్రయాణికులకు చిల్లర ఇవ్వడానికి కండక్టర్లకు ఇబ్బందులు ఏర్పడటంతో టికెట్ ధరలను రౌండ్ ఫిగర్ చేశారు. దీంతో అప్పుడు రేట్లు పెరిగాయి. మళ్లీ టోల్‌ప్లాజా రేట్లను ఎన్‌హెచ్‌ఏఐ పెంచడంతో ప్రయాణికులకు అవగాహన కల్పించకుండానే ధరలను పెంచేశారు. ఒకేసారి ధరలు పెంచడంతో ప్రయాణికులు నిలదీస్తున్నారు. గతంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు ఏసీ బస్సుల్లో టికెట్ ధర రూ.430 ఉండగా, ప్రస్తుతం రూ. 460కి పెరిగింది. ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రికల్ బస్సుల్లో రూ. 360 టికెట్ ధర ఉంటే ప్రస్తుతం రూ. 390 ధర నిర్ణయించారు. ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా రేషనలైజేషన్ పేరిట అన్ని రకాల ఎక్స్‌ప్రెస్‌లపై రూ.10 ధరలు పెంచింది. మహాలక్ష్మి పథకంతో ఎక్స్‌ప్రెస్ బస్సులలో పురుషులకు సీట్లు దొరకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా తాజాగా టికెట్ ధరలను పెంచడంతో భారం పడుతోంది. టికెట్ ధరల పెంపు విషయమై ఆర్టీసీ ఆర్‌ఎం జ్యోత్స్నను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

ఈత, ఖర్జూర మొక్కలకు ప్రాధాన్యం

- వన మహోత్సవంలో నాటేందుకు జీపీ నర్సరీల్లో పెంపకం

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఈ ఏడాది చేపట్టనున్న 11వ విడత వన మహోత్సవంలో ఈత, ఖర్జూర మొక్కలు ఎక్కువగా నాటించాలని గ్రామీణాభివృద్ధి శాఖ భావిస్తోంది. ఇందుకోసం ఆయా గ్రామ పంచాయతీల్లో ఈ రకాల మొక్కలను ఎక్కువ సంఖ్యలో పెంచుతోంది. లక్షా 50 వేల ఈత, 20 వేలకు పైగా ఖర్జూర మొక్కలు నాటేందుకు సిద్ధం ఉన్నాయి. గీత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు వీటిని గ్రామాల్లో చెరువు కట్టల వెంట, ఊరి శివారు ప్రాంతాల్లో నాటనున్నారు. ఆసక్తి గల గీత కార్మికులు స్థానిక పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి ఉచితంగానే ఈత, ఖర్జూర మొక్కలను తీసుకెళ్లడానికి అధికారులు అవకాశం కల్పించారు. అదే విధంగా రైతులు పొలాల్లో గట్ల వెంబడి నాటేందుకు టేకు మొక్కలను కూడా ఉచితంగా ఇవ్వనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ తెలిపారు.



డొంకేశ్వర్ మండలం దత్తాపూర్‌లో పెరుగుతున్న ఖర్జూర మొక్కలు

ఎస్సారెస్పీ వెలవెల.. రైతన్న విలవిల

- ప్రాజెక్టులో 13.8 టీఎంసీల నీరు నిల్వ
- ముందస్తు సాగుకు ఇబ్బంది


నీరు లేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ

బాల్కొండ: ఉత్తర తెలంగాణ జిల్లాల కల్పతరువు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో తగిన నీరు లేక వెలవెల బోతుంది. మే నెలలో కురిసిన అకాల వర్షాల వలన 2.8 టీఎంసీల నీరు వచ్చి చేరడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో 13.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కానీ సకాలంలో వరదలు రాకపోవడంతో ప్రాజెక్ట్ ఆయకట్టులో ముందస్తుగా పంటలను సాగు చేయడం కుదరడం లేదు. దీంతో యసంగి సీజన్‌లో సాగు పైనా నీటి కొరత ప్రభావం చూపుతుంది.

జూలై తర్వాతనే వరదలు..
శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాలా నుంచి ఎప్పుడు కూడ జూలై తరువాతనే వరదలు వచ్చి చేరుతుండటంతో కాలువల ద్వారా నీటి విడుదల ఆగస్టులో చేపడుతున్నారు. దీంతో పంటల సాగు ఆలస్యమవుతుంది. ప్రస్తుత సంవత్సరం కూడ ఎగువ ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు భారీ వరద నీరు వచ్చి చేరలేదు. ఎగువ ప్రాంతాల్లో, ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతాల్లో వర్షపాతం పెద్దగా లేకపోవడంతో వరద రావడం లేదు. ప్రస్తుత సంవత్సరం కూడ వరదలు ఆలస్యంగానే వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆయకట్టు రైతులు ముందస్తుగా సాగుపై పెట్టుకున్న ఆశలు ఆవిరవుతున్నాయి.

కనిపించని కాళేశ్వరం నీళ్లు..
శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి సకాలంలో వరదలు రాని సమయంలో కాళేశ్వరం నుంచి నీటిని వరద కాలువ ద్వారా రివర్స్‌పంపింగ్ ద్వారా ప్రాజెక్ట్‌కు తరలించేలా ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పనులు 2017లో ప్రారంభించారు. 2023లో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకాన్ని ప్రారంభించారు. కానీ కేవలం ప్రాజెక్ట్‌లోకి 2.5 టీఎంసీల నీరు మాత్రమే వచ్చి చేరింది. అప్పటి నుంచి కాళేశ్వరం నీటి కథ కంచికే చేరింది. దీంతో ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలపైనే ఆధారపడి నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది.

తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం

ప్రాజెక్ట్‌ను 112 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించగా ప్రస్తుతం 80.5 టీఎంసీలకు పడిపోయింది. గతేడాది ఎగువ ప్రాంతాల నుంచి 293 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. కానీ ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలే ఉండటంతో వందల టీఎంసీల నీరు గోదావరి పాలైంది. నీటి నిల్వ సామర్థ్యం తగ్గకుంటే నీటి నిల్వ ఎక్కువగా ఉండేది.

600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

ప్రాజెక్టులోకి స్థానిక ఎగువ ప్రాంతాల్లో గుంతల్లో నిలిచిన నీటి రూపంలో 600 క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 261 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1063.20(13.8 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

క్లుప్తంగా

డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు సెక్షన్ 163 అమలు

ఖలీల్‌వాడి: టీజీపీఎస్సీ నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు సెక్షన్ 163 (బీఎన్ఎస్) అమలు చేస్తున్నట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 24 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి పరీక్ష, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో పరీక్ష ఉంటుందన్నారు. అర్సపల్లి బైపాస్ రోడ్డులోని ఏవీ ఎంటర్‌ప్రైజెస్, మున్నూరు కాపు సంఘంలో పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద ఉండొద్దని, పరిసర ప్రాంతాలలోని అన్ని జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచాలని పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన మొక్కలను అందించాలి



రెంజల్(నవీపేట్): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ఇంటి మొక్కలను అందించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. నవీపేట్, అభంగపట్నం గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. నర్సరీలను పరిశీలించి, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన నిమ్మ, దానిమ్మ, జామ, కరివేపాకు, బొప్పాయి వంటి మొక్కలను వన మహోత్సవంలో అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇళ్ల నుంచి సేకరించాలన్నారు. పొడి చెత్తను విక్రయించాలని, తడి చెత్తతో కంపోస్టు ఎరువులను తయారు చేసి నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు వినియోగించుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకునేందుకు అవసరమైన వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణలు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో గురువారం పార్టీ అగ్ర నాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ 55వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి, సంబురాలు చేసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ నేటి యువకులకు ఆదర్శనీయమన్నారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి దేశ ప్రజల సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకున్నారన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, నాయకులు నరేందర్‌గౌడ్, నరేందర్ సింగ్, ప్రమోద్‌కుమార్, కోనేరు సాయికుమార్, రేవతి, పుష్పాల విజయ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న సివిల్స్ ఉచిత శిక్షణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని రజిత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రాష్ట్ర వ్యాప్తంగా రాత పరీక్ష నిర్వహించి, ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయము రూ.మూడు లక్షలకు మించరాని అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు ఈ నెల 18 నుంచి జూలై 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చేనెల 13న ఉదయం 10:30 గంటలకు నిజామాబాద్‌లో ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 81216 26423ను సంప్రదించాలన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ


కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిజామాబాద్‌నాగారం: మున్సిపల్ కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం టీబీ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికలకు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్షయ వ్యాధిని అంతమొందించడానికి క్షయ రహిత సమాజమే లక్ష్యంగా భారత ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించిందన్నారు. 2030 నాటికి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా ఈ వ్యాధి నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు గుంపులుగా ఉన్న ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని, సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. జిల్లాలో నేటి నుంచి శానిటరీ వర్కర్స్ అందరికీ టిబి, హెచ్‌ఐవి, హైపటైటిస్ బి-సి, సిఫిలిస్, బిపి డయాబెటిక్ వంటి వాటికి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. టిబి రోగులకు ఫుడ్ బాస్కెట్స్ అందజేశారు. జిల్లా టిబి నియంత్రణ అధికారిణి దేవి నాగేశ్వరి, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ అశోక్, సుశాంత్, మున్సిపల్ ఆఫీసర్ వాహిద్ అలీ, ప్రశాంత్, ఘన్పూర్ వెంకటేష్, రవి, లక్ష్మణ్, నరేష్, నాగరాజు, శ్యామల, విజయ ఉన్నారు.

50 మంది విద్యార్థులు చేరిక

నిజామాబాద్ అర్బన్: బడిబాట చివరి రోజైన గురువారం జీపీఎస్ కోటగల్లి శంకర్ భవన్ పాఠశాల నుంచి 5వ తరగతి ఉత్తీర్ణులైన దాదాపు 50 మంది విద్యార్థులను పైతరగతి కోసం శంకర్ భవన్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం శైలేష్ కుమార్ ఆధ్వర్యంలో నమోదు చేసినట్లు హెచ్ఎం రామచందర్ గైక్వాడ్ తెలిపారు. బడిబాట చివరి రోజు సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు దయానంద్, ప్రసన్న లక్ష్మి, సవిత, మమత, సౌందర్య, నందిని, సంతోష్, ముకుంద్ పాల్గొన్నారు.



సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి



జక్రాన్‌పల్లి: సైబర్ మోసాలు, గేమింగ్ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. వివిధ అంశాలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. 5ఎస్ విధానం అమలుపై సమీక్ష, పోలీస్ వాహనాల పార్కింగ్ పరిస్థితులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ఏసీపీ మాట్లాడుతూ.. గంజాయి నిర్మూలన కోసం పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. డిచ్‌పల్లి సీఐ వినోద్, ఎస్సై మాలిక్ రెహమాన్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి(స్పాట్) ఈ నెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పరుచూరి అనూష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025లో ఇంటర్ పాస్ అయిన విద్యార్థినులు అర్హులని తెలిపారు. ఆసక్తిగలవారు ఈ నెల 23న దరఖాస్తులను కళాశాలలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 9948192406, 9542748057, 96663 52860 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్మూర్ నుంచి తిరుమలకు వెళ్లే జెండా

మీకు తెలుసా?


ఆర్మూర్ పట్టణంలోని జెండా బాలాజి మందిరంలో జెండాను ప్రతిష్ఠిస్తున్న భక్తులు (ఫైల్)

ఆర్మూర్: పట్టణంలోని వేంకటేశ్వర (జెండా బాలాజీ)ఆలయం నుంచి తిరుమల వరకు పాదయాత్రగా తీసుకువెళ్లే జెండా పండుగను శ్రావణ మాసంలో ఆనవాయితీగా నిర్వహిస్తారు.

- 200 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న జెండా పండుగను తిరుపతికి వెళ్లలేని భక్తుల కోసం నిజాం నవాబుల కాలంలో అంకాపూర్ దొర గడ్డం వెంకట భూమారెడ్డి హయాంలో ప్రారంభించినట్లు ప్రతీతి.
- నిజాంలు జెండా పండుగ నిర్వహణకు ఎన్నో అడ్డంకులు కల్పించే వారని పెద్దలు చెబుతుంటారు. వాటిని అధిగమిస్తూ నేటికీ ఈ పండుగను, జాతరను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు.
- జెండా జాతర కోసం తొమ్మిది రోజుల ముందు జెండా కర్రకు 20 మీటర్ల పట్టు బట్టలను ఆర్మూర్‌లో నేసి జెండాపై ఉంచి దానిపై ఓం గుర్తును పెడతారు.
- శ్రావణ శుద్ధ తదియ రోజున జెండాను ప్రతిష్ఠించిన అనంతరం తొమ్మిది రోజుల పాటు జెండాకు పూజలు నిర్వహిస్తారు.
- అనంతరం ఆర్మూర్‌లోని జెండా మందిరం నుంచి ఊరేగింపుగా జెండాను తీసుకెళ్లి అంకాపూర్ గ్రామస్తులకు అప్పగిస్తారు.
- అంకాపూర్‌లో శ్రావణ శుద్ధ ఏకాదశి నుంచి భాద్రపద శుద్ధ చవితి వరకు 22 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- వినాయక చవితి తెల్లారి అంకాపూర్ గ్రామస్తులు జెండాను జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ వరకు తీసుకెళ్తారు. ఈ జెండాను గతంలో ముడుపులు కట్టి గ్రామంలో ఊరేగిస్తూ కాలి నడకన తిరుమల తిరుపతిలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేర్చేవారు. ప్రస్తుతం వాహనంలో తరలిస్తున్నారు.

రైతు సమాచారం

వరినారు వయస్సు 30 రోజులు మించొద్దు


మధుసూదన్, ఏవో డొంకేశ్వర్

డొంకేశ్వర్: ఖరీఫ్ సీజన్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు మండల వ్యవసాయాధికారి మధుసూదన్ పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వరి నాట్లు వేసేందుకు పొలాన్ని ఏ విధంగా సిద్ధం చేసుకోవాలి, ఎప్పుడు నాట్లు వేయాలి, యూరియా, మందుల వాడకంపై క్లుప్తంగా వివరించారు.

- వరినారు వయస్సు 25-30 రోజులు మించకుండా చూసుకోవాలి. ఈ మధ్య కాలంలో పొలంలో వేసిన నారు మొదటి ఎదుగుదల బాగుంటుంది.
- వివిధ తెగుళ్ల నివారణకు పొలం గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- నాట్లు ఆలస్యమైతే నారు కొనలను తీసేసి నాట్లు వేసుకోవాలి.
- నాట్లు వేసే ముందు రెండు నుంచి మూడు సార్లు వారం వ్యవధిలో పొలాన్ని దమ్ము చేయాలి. దమ్ము చేయడం వలన కలుపు మొక్కలను పూర్తిగా నాశనం చెయ్యవచ్చు.
- బురద పొలం చివరి దమ్ములో ఎకరానికి ఒక బస్తా డీఏపీ (50కిలోలు), యూరియా 10కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 10కిలోలు వేసి నాట్లు వేయాలి. నత్రజని ఎరువును యూరియా రూపంలో పైరు ఎదుగుదలను బట్టి రెండు, మూడుసార్లు బురద పదనులో వేయాలి.
- పైరు 50-60 రోజుల మధ్య వయసులో 50కిలోల యూరియాలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 15కిలోలు కలుపుకొని తప్పనిసరిగా వేయాలి.
- తెగుళ్లకు వ్యవసాయ అధికారులు సిఫార్సు చేసిన పురుగుల మందులను మాత్రమే వాడాలి.

ప్రయాణం.. ప్రమాదకరం..


ఎక్సెల్‌పై ప్రయాణం సాగిస్తున్న నలుగురు


చిన్న బండిపై భారీగా లోడ్ వేసుకొని, ఫోన్ మాట్లాడుతూ వెళుతున్న వ్యక్తి

కొందరు ద్విచక్ర వాహనదారులు ప్రయాణంలో సెల్‌ఫోన్ మాట్లడటం ప్రమాదమని తెలిసినా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. నగరంలో గురువారం ఓ వ్యక్తి మోపెడ్ వాహనంపై స్థాయికి మించి సామగ్రి లోడింగ్ చేయగా, ఆపై సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నాడు. మరొకరు అదే మోపెడ్‌పై స్థాయికి మించి నలుగురు ప్రయాణం చేస్తున్నారు. ఏదైన అనుకోని ఘటన జరిగితే భారీ ప్రమాదమే జరిగే అవకాశం ఉంది. దీంతో సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్రైం కార్నర్

శతాధిక వృద్ధురాలు మృతి


దస్లీబాయి (ఫైల్)

మాక్లూర్: మండలంలోని అమ్రాద్ తండాలో శతాధిక వృద్ధురాలు దస్లీబాయి (105) గురువారం మృతి చెందారు. దీంతో తండాలోని పలువురు గిరిజనులు శోకసముద్రంలో మునిగిపోయారు. నాటితరం వృద్ధురాలైన దస్లీబాయి గిరిజన తెగ సంప్రదాయాలను విస్మరించకుండా కొనసాగించటంలో పట్టుదలతో ఉండేవారని తండావాసులు విషాదవదనంతో తెలిపారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులు గిరిజన సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆమె కుమారులు, మనమలు, మునిమనుమళ్లు, మనుమరాళ్లు కడసారి వీడ్కోలు పలికారు. దస్లీబాయి భర్త బలరామ్‌నాయక్‌రెండు దశబ్దాల క్రితమే మృతి చెందాడు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ మెయిన్‌గేట్ వద్ద మురికికాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 17న సాయంత్రం రైల్వే స్టేషన్ మెయిన్ గేట్ పక్కన గల మురికి నాలాలో ఒక గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకొని అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతడిని పరిశీలించగా మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50నుంచి55ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మృతుడు తెలుపు రంగు, బ్లూకలర్ షర్ట్, గోధుమ కలర్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదన్నారు. ఎవరికైనా అతడి సమాచారం తెలిస్తే ఎస్‌హెచ్‌వో ఫోన్ నెంబర్ 8712659714కు సమాచారం అందించాలన్నారు.

ముప్కాల్ మండలంలో..



బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ ఊర చెరువులో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. స్థానికులు చెరువులో మృతదేహం ఉన్నట్లు సమాచారమివ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటాయన్నారు. అతడు బూడిద కలర్ ప్యాంట్, ఆకుపచ్చ రంగు షర్టు వేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కారు బోల్తా: ముగ్గురికి గాయాలు



వర్ని: మండలంలోని కొనిపూర్ క్యాంప్ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్‌తోపాటు పట్నం కుమార్, సాలె వెంకటి ముగ్గురు కలిసి కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో కొనిపూర్ క్యాంప్ శివారులో వారి కారు అదుపుతప్పి ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టి, పొలాల్లో బోల్తా పడింది. ఈ ఘటనలో కుమార్, వెంకటికి కాళ్లు విరగగా సురేష్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. వర్ని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి



రాజంపేట: మండల కేంద్రంలో ఓ బాలుడిపై వీధి కుక్కల దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా.. రాజంపేటలోని గడ్డమీది మహేష్, సంతోషిల కుమారుడు నిధ్విత్ (నాని)(6) బుధవారం సాయంత్రం ట్యూషన్ వెళ్లేందుకు ఇంటి నుంచి బయటకు రాగా కొద్ది దూరం వెళ్లగానే వీధి కుక్కల గుంపు దాడికి పాల్పడ్డాయి. దీన్ని గమనించిన తల్లి సంతోషి కుక్కలను తరిమికొట్టేందుకు ప్రయత్నించగా ఆమె పైకి కూడా దాడి చేయడానికి యత్నించాయి. అప్పటికే పలువురు కాలనీవాసులు అక్కడికి చేరుకుని కుక్కలను తరిమికొట్టారు. అనంతరం బాలుడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో వీధి కుక్కల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

బోధన్: ఎడపల్లి మండలం జాన్కంపేట గ్రామంలో ఈనెల 13న పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని గురువారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు.

మహిళను తోసివేసిన వ్యక్తిపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని బురడిగల్లీలో ఎదురెదురుగా ఉన్న మహిళలు గొడవ పడినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ శుక్రవారం తెలిపారు. ఎదురెదురుగా ఉండే తల్లికూతుళ్లతో మరో మహిళ గొడవ పడినట్లు తెలిపారు. సదరు మహిళ భర్త వచ్చి తల్లీకూతుళ్లను నెట్టివేయడంతో వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి



లింగంపేట: మండలంలోని అయిలాపూర్ గ్రామంలో బీరప్ప అనే రైతుకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. గ్రామ శివారులోని పొలంలో గురువారం మేత కోసం వెళ్లిన ఎద్దుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ. 70వేలు వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో అధికారులు పరిశీలించారు. అధికారులు స్పందించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

గుర్తుతెలియని వృద్ధురాలి ఆత్మహత్య




ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్, ఎస్సై తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్‌రైల్వే స్టేషన్‌సమీపంలోని కిలోమీటర్ నెంబర్ 460/10 వద్ద ఒక గుర్తు తెలియని వృద్ధురాలు జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి వయస్సు సుమారు 60ఏళ్లు ఉంటాయని తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదన్నారు. ఎవరికైనా ఆమె వివరాలు తెలిస్తే రైల్వే ఎస్సై 87126 58591కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వ్యాపారంలో పెట్టుబడి పేరుతో బురిడీ

నిందితుడి అరెస్టు

ఖలీల్‌వాడి: వ్యాపారంలో పెట్టుబడి పెడితే రూ. లక్షకు 20 శాతం లాభం వస్తుందని మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు తెలిపారు. నగరంలోని అహ్మద్ పురా కాలనీకి చెందిన మొహమ్మద్ అబ్దుల్ ఫరూజ్ సమీర్ (37)కు ఏడాది క్రితం ఆటోనగర్‌కు చెందిన ముక్తార్(45)తో పరిచయం ఏర్పడింది. ముక్తార్ ఎస్ఎస్ ఆటో మొబైల్ డీలర్ షాపు నిర్వహిస్తుండగా రూ.3లక్షల పెట్టుబడి పెట్టడానికి అతడి వద్ద తీసుకున్నాడు. ప్రతీ లక్షకు రూ. 20వేలు లాభంగా వస్తుందని హామీ ఇచ్చి, నెలకు రూ. 60వేలు లాభం ఇస్తానని చెప్పాడు. ఇదే తరహాలో ముక్తార్ పలువురు వ్యక్తుల నుంచి డబ్బులు సేకరించారు. మొదట్లో పలువురికి 20శాతం నుంచి 40శాతం వరకు లాభంగా ఇవ్వగా, కొన్ని రోజులకు వ్యాపారం మూసివేసి, బాధితులకు డబ్బులు ఇవ్వకుండా పారిపోయాడు. సుమారు 38 మంది బాధితుల నుంచి రూ.కోటి– కోటిన్నర వరకు అతడు డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఈక్రమంలో పోలీసులు ముక్తార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. మిగతా బాధితులను గుర్తించేందు, మోసపోయిన ఖచ్చితమైన మొత్తాన్ని నిర్ధారించేందుకు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి అదృశ్యం


మెఘావత్ మోహన్ ,లక్ష్మి,శిరీష

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన మేఘావత్ మోహన్, భార్య లక్ష్మీ, కూతురు శిరీషలు ఈనెల 14న తిరుపతికి దైవ దర్శనం నిమిత్తం నిజామాబాద్ రైల్వేస్టేషన్ నుంచి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు ఇంటికి చేరుకోలేదు. దీంతో వారి కుటుంబ సభ్యుడు రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారి సమాచారం తెలిస్తే 87126 59782, 87126 59874 నంబర్లకు అందించాలని సూచించారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మోర్తాడ్(బాల్కొండ): గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. మోర్తాడ్ నుంచి దోన్‌పాల్ వెళ్లే మార్గంలో విశ్వసనీయ సమాచారంతో మోర్తాడ్ ఎస్సై విక్రమ్ తనిఖీలు చేపట్టారు. మోర్తాడ్‌కు చెందిన పిట్టల సంతోష్, వడ్యాట్‌లో నివాసం ఉంటున్న నెల్లూర్ జిల్లాకు చెందిన బకీర్ గిరిబాబులు గంజాయి రవాణా చేస్తున్నట్లు సందేహం వచ్చి పోలీసులు వారిని తనిఖీ చేశారు. వారి వద్ద 10 చిన్న ప్యాకెట్లలో రూ.5వేలు విలువ చేసే 100 గ్రాముల గంజాయి పట్టుకున్నారు. మరో కవర్‌లో రూ.7,500ల విలువ చేసే 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు, ట్రాలీ ఆటోను, రూ.8,600ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సైలు విక్రమ్, అనిల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నకిలీ ట్రాన్స్‌జెండర్స్ అరెస్టు

బోధన్ టౌన్ (బోధన్): పట్టణంలోని విద్యా సంస్థలను నకిలీ ట్రాన్స్‌జెండర్స్ వేధించడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మెదక్ జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు హిజ్రాలుగా వేషం వేసుకొని పట్టణంలోని రాకాసిపేటలో గల క్రిసెంట్ పబ్లిక్ స్కూల్‌కి వెళ్లి డబ్బులు కావాలని ప్రిన్సిపాల్ వేధించారు. అలాగే ఇతర ప్రయివేటు పాఠశాలల్లోనూ డబ్బుల కోసం వేధించారన్నారు. దీంతో క్రిసెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ మీర్ జావిద్ అలీ ఫిర్యాదు చేయగా, ఈమేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.